సాక్షి నిజామాబాద్

సోమవారం, 10, జూలై, 2023



కేసీఆర్ ఫ్యామిలీకే పదవులు

తెలంగాణ వచ్చాక కేసీఆర్ ఫ్యామిలీకే అన్ని పదవులు దక్కాయని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

- 8లో ▸



పోడు పట్టాల ఘనత సీఎందే..

గిరిజనులకు పోడు పట్టాలను పంపిణీ చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం

31.9 /24.5

వాతావరణం

ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం మేఘావృతమై చిరుజల్లులు కురియవచ్చు. సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షం పడే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఊర పండుగకు భారీ బందోబస్తు

ఖలీల్‌వాడి : జిల్లాకేంద్రంలో ఊర పండగ సందర్భంగా ఖిల్లా రోడ్డు నుంచి మహాలక్ష్మి టెంపుల్ వరకు ఆదివారం పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. నగరంలోని ఖిల్లా నుంచి దేవతామూర్తులు ఊరేగింపు వివేకానంద చౌరస్తా, గురుద్వార్, పెద్దబజార్ చౌరస్తా, గోల్ హన్మాన్, పూలాంగ్ చౌరస్తా, వినాయక్‌నగర్ ప్రాంతాలలోని మహాలక్ష్మి గుడి వరకు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దేవతామూర్తులు వచ్చే సమయంలో ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు. డీసీపీ, ఏసీపీలు బందోబస్తు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. సీఐలు పర్యవేక్షించారు. బందోబస్తులో 10 మంది సీఐలు, 25మంది ఎస్సైలు, 500 మందిసిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న కాళేశ్వరం నీటి ఇన్‌ఫ్లో



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి కాళేశ్వరం ద్వారా ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఆదివారం మూడు పంపుల ద్వారా 2,409 క్యూసెక్కుల నీటిని ఎత్తి ప్రాజెక్టులోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి 2,909 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్ట్ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్టు నీటిమట్టం 1091అడుగుల(90 టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్టులో 1065.70 అడుగుల(21.4 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

12న విద్యాసంస్థల బంద్‌కు పిలుపు

నిజామాబాద్ అర్బన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 12న విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అనిల్ తెలిపారు. ఆదివారం నగరంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్‌కు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు.

సఖి కేంద్రానికి బాలిక తరలింపు

నవీపేట : మండలంలోని అబ్బాపూర్(బి) తండాలో జరిగిన బాల్య వివాహం ఘటనను పోలీస్ ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. ఫకీరాబాద్ గ్రామంలోని 45 ఏళ్ల వరుడు సాయెబ్‌రావు బంధువుల ఇళ్లలో శనివారం పోలీసులు సోదాలు నిర్వహించారు. ఓ బంధువు ఇంట్లో బాలిక ఆచూకీ లభమైంది. అయితే వరుడు సాయెబ్‌రావ్, బాలిక తండ్రి ఇంకా పరారీలోనే ఉన్నారు. వారికోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇదిలా ఉండగా బాలికను జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రానికి అప్పగించారు. సోమవారం సీడబ్ల్యూసీ ప్రతినిధులు భే అయి బాలికను బాలసదన్‌కు తరలించే అంశంపై చర్చిస్తారు.



శునకానికి దశదిన ఖర్మ

బాల్కొండ : మెండోరాకు చెందిన పేసరి శ్యాం ఇంట్లో పెంపుడు కుక్క(జిమ్మి) అనారోగ్యంతో 12 రోజుల క్రితం మృతి చెందింది. దీంతో ఆదివారం శునకానికి ఖర్మ నిర్వహించారు. ఈసందర్భంగా జిమ్మి ఫొటోను పీఠం పెట్టి పిండం పెట్టి నివాళులర్పించారు. జిమ్మి జ్ఞాపకాలను కుటుంబ సభ్యులు నెమరు వేసుకున్నారు.

ఊరంతా కలిసి.. అమ్మను కొలిచి..





నగరంలోని ఖిల్లా వద్ద ఊర పండుగలో పాల్గొన్న భక్తులు



ఖిల్లా నుంచి గ్రామ దేవతలను తీసుకెళ్తున్న భక్తులు

- నగరంలో ఘనంగా ఊర పండుగ
- గ్రామ దేవతల శోభాయాత్రను ప్రారంభించిన సర్వసమాజ్ కమిటీ అధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ
- పూజలు చేసిన బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నేతలు
- వేల సంఖ్యలో పాల్గొన్న భక్తజనం
- ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు

పులోరియా.. పులోరియా నినాదాలతో ఇందూరు నగరం పులకరించిపోయింది.. డప్పు చప్పుళ్లు.. పోతరాజుల విన్యాసాలతో ఆదివారం నగర వాసులు ఊర పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఊరేగింపుగా వస్తున్న గ్రామదేవతలకు ప్రజలు స్వాగతం పలికారు. భక్తిశ్రద్ధలతో కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. తమ కుటుంబాలపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఉండాలని సల్లంగా చూడు తల్లీ.. అంటూ వేడుకున్నారు.

నిజామాబాద్ సిటీ : నగరంలో ఊర పండుగను ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామ దేవతలను తీసుకెళ్లే పురవీధులన్నీ జనసంద్రంలా మారాయి. సర్వసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఖిల్లా వద్ద తేలు మైసమ్మ గద్దెపై గ్రామ దేవతలను కూర్చోబెట్టగా వేలాది సంఖ్యలో నగర ప్రజలు అమ్మవార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 7 గంటల నుంచే ఇక్కడ భక్తులు అమ్మవార్లను దర్శించుకునేందుకు బారులు తీరారు. ఈ సందర్భంగా గద్దెపై రెండు వరుసల్లో ప్రత్యేక బారికేడ్లను ఏర్పాటు చేశారు. అర్బన్ ఎమ్మెల్యే గణేశ్ బిగాల, మేయర్ దండు నీతూ కిరణ్, రాష్ట్ర మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆకుల లలిత, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, మాజీ మేయర్ ఆకుల సుజాత శ్రీశైలం, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్, బీఆర్‌ఎస్, బీజేపీకి చెందిన కార్పొరేటర్లు, నాయకులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లను దర్శించుకునేందుకు ఖిల్లా ప్రాంతం, వివేకానంద చౌరస్తా, గురుద్వార్, పెద్దబజార్ చౌరస్తా, గోల్‌హనుమాన్ ప్రాంతాలు జనసంద్రంలా మారాయి. ఉదయం 9.30 గంటలకు తేలు మైసమ్మ గద్దె నుంచి గ్రామదేవతల శోభాయాత్రను సర్వసమాజ్ కమిటీ అధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ ప్రారంభించగా, కమిటీ కన్వీనర్ రామర్తి గంగాధర్, కో కన్వీనర్ ఆదె ప్రవీణ్‌కుమార్, కోశాధికారి బంటు కిషన్, ప్రధాన కార్యదర్శి బంటు రాజేశ్వర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఖిల్లా నుంచి బయలుదేరిన శోభాయాత్ర పెద్దబజార్ చౌరస్తా వద్ద రెండు బృందాలుగా విడిపోగా ఒక బృందం సారాలమ్మ, నల్లపోచమ్మ, అడెల్లి పోచమ్మ, పెద్దమ్మత్తు రాట్నం వైపు బయలుదేరి వెళ్లగా, మరో బృందం సిర్నాపల్లి గడి, గోల్‌హనుమాన్, పులాంగ్ చౌరస్తా మీదుగా వినాయక్‌నగర్‌లోని అయిదు చేతుల పోచమ్మ, వంద ఫీట్ల రోడ్డులోని మత్తడి పోచమ్మ, మహాలక్ష్మి నగర్‌లోని మహాలక్ష్మి ఆలయం వరకు శోభాయాత్ర ఘనంగా కొనసాగింది. మహాలక్ష్మి ఆలయానికి అమ్మవారు మధ్యాహ్నం 3 గంటలకు చేరుకోగా మహాలక్ష్మి మాతను ప్రతిష్ఠించారు. అప్పటివరకు భక్తులు ఓపికగా వేచిఉండి అమ్మవార్లను ప్రతిష్ఠించిన అనంతరం దర్శించుకున్నారు.

సరి కోసం పోటీ..

గ్రామ దేవతలకు సమర్పించే సరి (ప్రసాదం) కోసం భక్తులు పోటీ పడ్డారు. గ్రామదేవతలకు సరి సమర్పించాక వాటిని పొలాల్లో పంటలు బాగా పండుతాయని, ఇళ్లలో చల్లుకుంటే అందరూ క్షేమంగా ఉంటారని నమ్మకంతో సరిను దక్కించుకునేందుకు భక్తులు సరి చల్లే వారివద్దకు ఒకేసారి వెళ్లడంతో తోపులాట జరిగింది. చివరకు పోలీసులు వారికి రక్షణ కల్పించటంతో శోభాయాత్ర కొనసాగిన ప్రధాన చౌరస్తాలో సరిని చల్లుతూ వారు ముందుకెళ్లారు.



శివసత్తుల పూనకాల మధ్య..

ఖిల్లా తేలు మైసమ్మ వద్ద ప్రారంభమైన గ్రామ దేవతల శోభాయాత్ర డప్పుదరువుల మధ్య, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల నడుమ పులోరియా పులోరియా అంటూ అమ్మవార్లకు వేడుకోలుతో నగర వీధుల గుండా శోభాయాత్ర ప్రశాంతంగా జరిగింది. శోభాయాత్రలో పోతురాజుల విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఖిల్లా వద్ద నుంచి గతేడాది కంటే ఈసారి రెండు గంటలు ఆలస్యంగా శోభా యాత్ర ప్రారంభమైంది.

నగర ప్రజల ఐక్యతకు నిదర్శనం : ఎమ్మెల్యే బిగాల

నిజామాబాద్ సిటీ : ఎన్నోఏళ్లుగా భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న ఊర పండుగ నగర ప్రజల ఐక్యతకు నిదర్శనమని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా పేర్కొన్నారు. ఆదివారం ఊర పండుగ సందర్భంగా ఖిల్లా వద్ద తేలు మైసమ్మ గద్దెపై గ్రామ దేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేయర్ నీతూ కిరణ్, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు సిర్ప రాజు, నాయకులు సుజిత్ సింగ్ ఠాకూర్, సత్యప్రకాష్, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



క్రీడాస్ఫూర్తితో ఆడితే విజయం తథ్యం

- అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా
- ప్రారంభమైన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ మహిళా ఫుట్‌బాల్ టోర్నీ

నిజామాబాద్ నాగారం : క్రీడాస్ఫూర్తితో ఆడితేనే క్రీడల్లో విజయం వరిస్తుందని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా తెలిపారు. మహిళా సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీ ఆదివారం పోలీస్‌పరేడ్ మైదానంలో అట్టహాసంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా అర్బన్ ఎమ్మెల్యే బిగాల, జెడ్పీ చైర్మన్లు హాజరై క్రీడాకారుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. ఎమ్మెల్యే బిగాల మాట్లాడుతూ, రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ అనుమతితో జిల్లాలో రాష్ట్రస్థాయి టోర్నీ నిర్వహించడం సంతోషకరమన్నారు. జిల్లా జట్టుకు క్రీడా దుస్తులు అందించిన డాక్టర్ కవిత రెడ్డిని సన్మానించారు. క్రీడాకారులకు వసతి ఏర్పాటు చేసిన బాస్కెట్ బాల్ రాష్ట్ర కార్యదర్శి రాజేందర్ రెడ్డిని అభినందించారు. ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్న కేర్ ఫుట్‌బాల్ అకాడమీ అధ్యక్షుడు నరాల సుధాకర్‌ను, కోచ్ నాగరాజును అతిథులు అభినందించారు. జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, మేయర్ నీతూకిరణ్, రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి, భారత మహిళా ఫుట్‌బాల్ జట్టు మేనేజర్ ఫల్గుణ, ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు షకీల్, కార్యదర్శి జావేద్, ఒలింపిక్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఈగసంజీవ్‌రెడ్డి,బొబ్బిలినర్సయ్య పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బిగాల

ఆరోగ్య ఉప కేంద్రాలకు మహర్దశ

- 20 సబ్ సెంటర్లకు రూ. 4 కోట్లు

డిచ్‌పల్లి : నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో పక్కా భవనాలు కలిగిన ఆరోగ్య ఉప కేంద్రాల(హెల్త్ సబ్ సెంటర్ల)కు మహర్దశ రానుంది. 20 సబ్‌సెంటర్లకు మరమ్మతులు, పునరుద్ధరణ కోసం సర్కారు నిధులు మంజూరయ్యాయి. ఒక్కో సబ్‌సెంటర్‌కు రూ. 20లక్షల చొప్పున మొత్తం రూ. 4 కోట్ల నిధులను కేటాయిస్తూ వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు టీఎస్ ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆదివారం తెలిపారు. నియోజకవర్గంలోని 20 సబ్‌సెంటర్లలో తాగునీరు, కరెంటు, డ్రైనేజీ, మూత్రశాలలు, ప్రహరీ నిర్మాణం, వ్యర్థాల నిర్వహణ, పెయింటింగ్, రోగులు కూర్చునేందుకు కుర్చీలు, రిజిస్టర్ల నిర్వహణ తదితర పనులకు ఈ నిధులు వెచ్చిస్తారని, త్వరలోనే ఈ పనులు ప్రారంభిస్తారని ఎమ్మెల్యే తెలిపారు.



నిధులు మంజూరైన హెల్త్ సబ్‌సెంటర్ల వివరాలు

- డిచ్‌పల్లి మండలంలోని బర్దిపూర్, డిచ్‌పల్లి, ఘన్‌పూర్, నడిపల్లి, రాంపూర్, ధర్మారం(బి), సుద్దపల్లి.
- ధర్పల్లి మండలంలోని ధర్పల్లి, 2 హెల్త్ సబ్‌సెంటర్లు ధర్పల్లి (ఏ), ధర్పల్లి (బి).
- సిరికొండ మండలంలోని న్యావనంది, గడ్కోల్, తూంపల్లి.
- మోపాల్ మండలంలోని బాడ్సి, కులాస్‌పూర్, మోపాల్, మంచిప్ప.
- జక్రాన్‌పల్లి మండలంలోని అర్గుల్, కొలిప్యాక్, సికింద్రాపూర్.
- ఇందల్వాయిలోని చంద్రాయన్‌పల్లి.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక..

రుద్రూర్ : రుద్రూర్ మండల కేంద్రంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని కుల సంఘాల ఆధ్వర్యంలో బోనాలతో వతన్‌దార్ దేశాయ్ ఇంటి వద్దకు చేరుకున్నారు. ఇక్కడ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి దంపతులు బోనం ఎత్తుకుని ఊరేగింపు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయలకు ప్రతీకగా బోనాల పండుగ నిలుస్తోందన్నారు. అనంతరం పోతరాజుల విన్యాసాలు, యువకుల నృత్యాల మధ్య బోనాలతో వెళ్లి గ్రామ దేవతలకు సమర్పించారు. సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్, ఎంపీపీ అక్కపల్లి సుజాతనాగేందర్, జెడ్పీటీసీ నరోజి గంగారాం, బోధన్ ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్, గ్రూప్ వన్ అధికారుల సంఘం అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్, సింగిల్ విండో చైర్మన్ సంజీవరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ పాల్గొన్నారు.



రుద్రూర్‌లో బోనం ఎత్తుకున్న స్పీకర్ పోచారం దంపతులు

క్లుప్తంగా

స్వగ్రామం చేరిన మృతదేహం

రామారెడ్డి: విజిట్ వీసాపై మస్కట్ వెళ్లి, ఏజెంట్ చేతిలో మోసపోయి రోడ్డు మీద పడి తినడానికి తిండి లేక మృతి చెందిన ఉప్పల్‌వాయి గ్రామానికి చెందిన పురం సిద్ధిరాములు(46) మృతదేహం ఆదివారం స్వగ్రామం చేరింది. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉండడంతో చిన్న కుమార్తె తండ్రి అంత్యక్రియాలు నిర్వహించింది. సర్పంచ్ గంగారం, రైతుబంధు కమిటీ మండలాధ్యక్షుడు నారాయణరెడ్డి, గ్రామస్తులు బాధిత కుటుంబానికి రూ.30 వేల ఆర్థిక సాయం చేశారు.

గుంతలు పూడ్చాలని లారీలు అడ్డగింత



నిజాంసాగర్: మండలంలోని ఒడ్డేపల్లిలో ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని కోరుతూ ఆదివారం గ్రామ ఉప సర్పంచ్ బొజ్జ అంజయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులు లారీలను అడ్డుకున్నారు. మంజీర నదిపై నల్లవాగు మత్తడి నిర్మాణ పనులకు ఇసుక, కంకరను తరలిస్తున్న లారీలతో బీటీ రోడ్డు ధ్వంసమై గుంతలుగా మారిందన్నారు. ఆ గుంతల్లో వర్షం నీరు నిలిచి ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. రోడ్డుపై గుంతలను పూడ్చిలని ఉప సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు లారీలను అడ్డుకున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపడుతామని కాంట్రాక్టర్ హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళనను విరమించారు.

ఆర్టీసీ బస్సులో చోరీ?

ధర్పల్లి: ప్రయాణికురాలి బ్యాగులో నుంచి సుమారు 10 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైన ఘటన నిజామాబాద్ నుంచి భీమ్‌గల్ వెళ్తున్న బస్సులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. కామారెడ్డికి చెందిన ఇద్దరు మహిళలు ధర్పల్లి మండలం దమన్నపేట గ్రామానికి బయలుదేరారు. వారు ఇందల్వాయిలో నిజామాబాదు నుంచి భీమ్‌గల్‌కు వెళ్తున్న బస్సును ఎక్కారు. ధర్పల్లి వరకు టికెట్ తీసుకొని ప్రయాణిస్తున్నారు. ధర్పల్లి స్టేజీ రాగానే బస్సు నుంచి దిగిపోయారు. బస్సు దిగిన తర్వాత వారి హ్యాండ్ బ్యాగ్ జిప్పు తెరిచి ఉండడం గమనించిన సదరు మహిళ నగల డబ్బా గురించి వెతగ్గా కనిపించలేదు. ఇందల్వాయిలో బస్సు ఎక్కే సమయంలో హ్యాండ్ బ్యాగ్‌లో ఉన్న నగల డబ్బాను ఎవరో చోరీ చేసినట్లు బాధితులు అనుమానం వ్యక్తం చేసినట్లు స్థానికులు పేర్కొన్నారు. దీనిపై ధర్పల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డిని వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

కామారెడ్డి క్రైం: తాడ్వాయి మండలం సోమారం గ్రామానికి చెందిన అజ్మీర రాణి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. వివరాలు ఇలా ఉన్నాయి. అజ్మీర రాణికి భర్త స్వామి, నలుగురు పిల్లలు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. భార్యాభర్తల మధ్య ఇటీవల గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన రాణి ఆదివారం సాయంత్రం ఇంటి వద్ద గడ్డి మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ఘనంగా ఊర పండుగ

నిజామాబాద్‌లో ఆదివారం ఊర పండుగ సంబరంగా జరిగింది. గ్రామ దేవతలను కొలిచేందుకు నగరమంతా కదిలింది. భక్తులతో రోడ్లన్నీ కిక్కిరిశాయి. దారిపొడుగునా భక్తులు గ్రామ దేవతలకు స్వాగతం పలుకుతూ ప్రత్యేక పూజలు చేశారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్





గాజులపేట్‌లో సరి కోసం దూసుకు వస్తున్న యువకులను లాఠీలతో కొడుతున్న పోలీసులు



ఊర పండుగలో తొట్టె కింద కూర్చున్న భక్తులు



మొక్కుతున్న యువతి



కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు



పోతురాజుల విన్యాసాలు



కోడితో మొక్కు తీర్చుకుంటున్న మహిళ



కామారెడ్డిలో బూర్గు మైసమ్మ బోనాలతో భక్తులు



దోమకొండలో రంగం చెబుతున్న మహిళ

బోనమెత్తిన గ్రామాలు

కామారెడ్డి జిల్లాలోని పలు గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సల్లంగా చూడు తల్లి అని వేడుకున్నారు.



దోమకొండలో మహంకాళి అమ్మవారికి బోనాలు తీసుకువస్తున్న మహిళలు



మల్లూరులో గంగమ్మకు తెప్పలు వదులుతూ..



దోమకొండలో బీజేపీ నాయకుడు రమణారెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఈశ్వర్ గ్యాస్ట్రో లివర్ కేర్ ఆస్పత్రి ప్రారంభం

నిజామాబాద్ సిటీ: నగరంలోని ఖలీల్‌వాడిలో ఏర్పాటు చేసిన ఈశ్వర్ గ్యాస్ట్రో లివర్ కేర్ ఆస్పత్రిని ఆదివారం అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా ప్రారంభించారు. నగరంలో మరో గ్యాస్ట్రో లివర్ కేర్ ఏర్పాటు చేయటంతో వైద్యుడు ఈశ్వర్ చేగంటిని ఎమ్మెల్యే అభినందించారు. రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని కోరారు. నగర మేయర్ దండు నీతూ కిరణ్, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు సిర్ప రాజు, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రాంచందర్, తానా అధ్యక్షుడు మన్మోమోహన్ కళ్యాన్‌పాడ్, సీనియర్ గ్యాస్ట్రోలజిస్ట్ శ్రీనివాస్, వైద్యురాలు చేగంటి రాజేశ్వరీ, మేనేజ్‌మెంట్ శ్రీనివాస్ గలాల, నాయకులు బైఖాన్ మధు, సుజీత్‌సింగ్ ఠాకూర్, సత్యప్రకాష్ పాల్గొన్నారు.



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా

కేసీఆర్ ఫ్యామిలీకే పదవులు

- బీఆర్‌ఎస్, బీజేపీ ఒక్కటే
- కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు ప్రాధాన్యం
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్

ఖలీల్‌వాడి : తెలంగాణలో కేసీఆర్ ఫ్యామిలీకే అన్ని పదవులు దక్కాయని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నగరంలోని 12, 13, 47, 33 డివిజన్లకు చెందిన ముస్లిం యువకులు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన 150 మందికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్, బీజేపీలు ఒక్కటేనన్నారు. బీజేపీ ప్రవేశపెట్టిన అనేక పథకాలకు బీఆర్‌ఎస్ మద్దతు తెలిపిందన్నారు. తెలంగాణలో పదవులు బీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పదవులు దక్కవని కేవలం ఒకే కుటుంబం పదవులు అనుభవిస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిందని, దేశం కోసం బలిదానాలు చేసుకున్న కుటుంబం రాహుల్‌గాంధీ కుటుంబమన్నారు. తెలంగాణలో కేసీఆర్ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వస్తే రూ. 4 వేల పెన్షన్ అందిస్తుందని, మహిళలకు రూ. 500లకే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తామన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత బాడ్సి శేఖర్‌గౌడ్, సయ్యద్ కైసర్, రాజ నరేంద్రగౌడ్, నరేంద్రసింగ్, మహ్మద్ అరిఫ్, మహ్మద్ ఇంతియాజ్, సయ్యద్ ఫారూక్, మహ్మద్ ఇంతియాజ్ తదితరులు ఉన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్

కారు, బైక్ ఢీ : ఒకరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం ఉగ్రవాయి వద్ద బైకును కారు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం రాత్రి 8:30 గంటల ప్రాంతంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. బీబీపేటకు చెందిన సిద్ధిరాములు అలియాస్ రమేశ్ (35) స్థానికంగా మెడికల్ షాప్ నిర్వహిస్తున్నాడు. సిరిసిల్ల జిల్లా గంబీరావుపేటకు చెందిన పల్లె శివకృష్ణ బీబీపేటలో ల్యాబ్ టెక్నీషియన్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. వారిద్దరూ కలిసి ఆదివారం సాయంత్రం పనులు ముగించుకుని కామారెడ్డికి బైక్‌పై బయలుదేరారు. ఉగ్రవాయి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఒక కారు, వీరి బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రమేష్ అక్కడికక్కడే మృతి చెందగా శివకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలాన్ని దేవునిపల్లి పోలీసులు పరిశీలించారు. తీవ్రంగా గాయపడిన శివకృష్ణను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



రమేశ్ మృతదేహం



గాయపడిన శివకృష్ణ

చెరువులో గల్లంతైన వ్యక్తి..

సిరికొండ: మండలంలోని కొండాపూర్ గ్రామ ఊర చెరువులో గల్లంతైన వ్యక్తి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన తూము సుదర్శన్(36) శనివారం చేపలు పట్టడానికి ఊర చెరువులోకి వెళ్లాడు. చేపలు పడుతుండగా ఫిట్స్ రావడంతో తెప్పపై నుంచి చెరువులో పడిపోయాడు. శనివారం గాలించినప్పటికి ఆచూకీ లభించలేదు. ఆదివారం గాలించగా సుదర్శన్ మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య రజిత, ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్యకు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో పిల్లల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది.



సుదర్శన్(ఫైల్)

చికిత్స పొందుతూ యువకుడు..

మోపాల్: మండలంలోని శ్రీరాంనగర్ తండా గ్రామపంచాయతీకి చెందిన సురేందర్ (17) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రా మస్తులు ఆదివారం తెలిపారు. తండాకు చెందిన సురేందర్ మూ డురోజుల క్రితం గబ్బర్‌సింగ్ అనే వ్యక్తితో కలిసి బైక్‌పై వెళ్తుండగా ఆటోను తప్పించబోయి అదుపుతప్పి పడిపోయారు. ప్రమాదంలో సురేందర్ తలకు తీవ్ర గాయాలై కోమాలోకి వెళ్లాడు. గబ్బర్‌సింగ్ కాలుకు గాయమైంది. సురేందర్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించి శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు.



సురేందర్ (ఫైల్)

వలస కార్మికుల రక్షణే ధ్యేయంగా..

- కార్మికుల కోసం పని చేస్తున్న సంఘాల నాయకులకు కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ
- శిక్షణ అంశాలను వెల్లడించిన ఇమిగ్రంట్స్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షుడు మంద భీంరెడ్డి

మోర్తాడ్: వలస కార్మికుల హక్కుల రక్షణ, సంక్షేమం కోసం పని చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు మరింత మెరుగ్గా పని చేయడం కోసం అవసరమైన శిక్షణను థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లో ఇటీవల మూడు రోజుల పాటు నిర్వహించారు. వలస కార్మికుల కోసం నిర్దిష్టమైన ప్రభుత్వాల విధానాలు, వలస హక్కుల సంస్థలు ఉనికిలో ఉన్నప్పటికి కార్మికులను హింసించడం, వారిని దోపిడికి గురి చేయడం కొనసాగుతూనే ఉంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదనే సంకల్పం, వలస కార్మికులకు మరెన్నో సేవలు అందించాలనే లక్ష్యంతో కార్మిక సంఘాలను బలోపేతం చేయడం కోసం ఫిలిప్పీన్స్ కేంద్రంగా పని చేస్తున్న మైగ్రెంట్ ఫోరం ఇన్ ఏసియా(ఎంఎఫ్ఏ), థాయిలాండ్ కేంద్రంగా పని చేస్తున్న హ్యూమన్ రైట్స్ అండ్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ అనే సంస్థలు సంయుక్తంగా కెపాసిటి–బిల్డింగ్(సామర్థ్య పెంపు) శిక్షణను కొనసాగించాయి. తెలంగాణ నుంచి గల్ఫ్ దేశాలకు వలసలు విస్తరించిన నేపథ్యంలో వలస కార్మికుల తరపున వాయిస్‌ను వినిపించడానికి ఇమిగ్రంట్స్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షులు మంద భీంరెడ్డి ఈ శిక్షణకు హాజరయ్యారు. శిక్షణ ముగించుకుని ఇటీవలే మాతృభూమికి చేరుకున్న ఆయన అక్కడ జరిగిన చర్చ విషయాలను 'సాక్షి'తో పంచుకున్నారు. ఆయన మాటల్లోనే సామర్థ్య పెంపు శిక్షణ అంశాలు.



బ్యాంకాక్‌లో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న మంద భీంరెడ్డి, ప్రతినిధులు

పునరావాసం, పునరేకీకరణ

గల్ఫ్ దేశాలతో పాటు ఇతర ఆసియా దేశాలకు వలస వెళ్లి సొంతగడ్డకు చేరుకుంటున్న కార్మికులకు పునరావాసం, పునరేకీకరణ ప్రధానం. వాపస్ వచ్చిన కార్మికులకు స్థిరమైన పద్ధతిలో పునరేకీకరణ జరగకపోవడంతో వారు మానసికంగా కుంగిపోయి అనారోగ్యంతో మంచానపడటం, ఆత్మహత్యలకు పాల్పడటం జరుగుతుంది. దీనిపై ప్రభుత్వాలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అనేక మంది వలస కార్మికులు కంపెనీల్లో మోసాలకు గురైతున్నారు. ఒప్పందం ప్రకారం వేతనాలు అందుకోలేక నష్టపోతున్నారు. వలస వెళ్లడానికి చేసిన అప్పును సైతం తీర్చలేక అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. వలస కార్మికుల ఆదాయం దండిగా అందుతున్నా ఆ కార్మికుల కోసం ఖర్చు పెట్టడానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపు కరువైంది. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు గల్ఫ్ దేశాల నుంచి వాపస్ వచ్చిన వలస కార్మికులకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్‌ల ద్వారా రాయితీ రుణాలను అందించారు. వలస కార్మికులకు పునరావాస చర్యలు అప్పట్లో జరిగినా ఆ తరువాత పట్టించుకునేవారు లేక కార్మికులు ఆదరణకు నోచుకోలేకపోయారు.

శిక్షణలో పాల్గొన్న భారతీయ కార్యకర్తలు

వివిధ దేశాల్లో ఉద్యోగం చేస్తూ స్థిరపడిన భారతీయ సామాజిక కార్యకర్తలు బ్యాంకాక్ శిక్షణలో పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. వారిలో మంద భీంరెడ్డి(తెలంగాణ), రెజిమోన్ కుట్టప్పన్(కేరళ), టి హంబర్ట్ సన్(తమిళనాడు), థామస్ మాథ్యూ కడవిల్(కువైట్), కవితాశ్రీ సువర్ణ సంపత్(బహ్రెయిన్), సుధీర్ తిరునిలత్(బహ్రెయిన్), బినో పుతెన్ పురక్కల్(ఒమాన్), షమీమ్ పిటికె(ఒమాన్), డాక్టర్ ప్రతిభ రాతీశ్(ఖతర్), లతీఫ్ టెక్కి(సౌది అరేబియా), ప్రసాద్ కృష్ణ(యూఏఈ)లు హాజరయ్యారు.

సక్రమ వలసలు ముఖ్యం

సక్రమ, క్రమబద్ధ వలసలను కొనసాగించడం ద్వారా కార్మికులకు అన్ని రకాల నష్టాలు తప్పుతాయి. ఇందుకోసం ప్రపంచ సంఘటిత ఒప్పందం అబ్జెక్టివ్–6(లక్ష్యం) ప్రకారం నిష్పాక్షికమైన, నైతికమైన ఉద్యోగాల భర్తీ ప్రక్రియను సులభతరం చేస్తూ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది. వలస కార్మికులకు గౌరవప్రదమైన పని కోసం రక్షణ కల్పించడానికి సానుకూలమైన పరిస్థితులను కల్పించాలి. ఇందులో భాగంగా ఏజెన్సీలను కట్టడి చేయడం, నకిలీ ఏజెంట్లను గుర్తించి మోసాలు జరుగకుండా చూడటం, ఒప్పందం ప్రకారం పని, వేతనం దక్కేలా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

కత్తితో దాడి చేసిన ఎనిమిది మంది అరెస్ట్

ఖలీల్‌వాడి: నగరంలోని గౌతంనగర్‌కు చెందిన మాజీద్‌పై ఈ నెల 7న రాత్రి 11.30 గంటలకు కత్తితో దాడి చేసిన కేసులో ఎనిమిది మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. మాజిద్‌పై అతని బావమర్ది నయీమ్, అతని మిత్రులు కత్తితో దాడి చేశారు. స్థానికుల సహాయంతో తప్పించుకున్న మాజిద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అతని త మ్ముడు సాజిద్ ఫిర్యాధు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శనివారం కత్తితో దాడి చేసి న 10 మందిలో మహమ్మద్ నయీమ్, సయ్యద్ ముదసిర్, షేక్ ఆవేష్, షేక్ సిరాజ్, షేక్ సమీర్, షేక్ మోసిన్, షేక్ షదాబ్, ఇర్ఫాన్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మరో ఇద్దరు నిందితులు బస్రత్ అమీర్, ఏజాజ్ పరారీలో ఉన్నారని వారి కోసం గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోడు పట్టాల ఘనత సీఎం కేసీఆర్‌దే..

- ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి: గిరిజనులు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న పోడు భూముల సమస్యను పరిష్కరించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని టీఎస్ ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఆదివారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి మండలాలకు చెందిన లబ్దిదారులకు పోడుపట్టాల పాసుబుక్కులను ఆయన పంపిణీ చేశారు. రూపాయి అవినీతికి తావు లేకుండా కేసీఆర్ గిరిపుత్రులను అన్నదాతలను చేశారని తెలిపారు. నిజామాబాద్ రూరల్ నియోజవకర్గంలో మొత్తం మూడు వేల మంది గిరిజనులకు దాదాపు 1,700 ఎకరాల పోడు భూములను పంపిణీ చేశామన్నారు. పనికిమాలిన ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దన్నారు. తెలంగాణ మోడల్ దేశానికి అమలు కావాలంటే కేసీఆర్ పీఎం కావాలే అని ఎమ్మెల్యే అన్నారు. ప్రధాని మోదీ గుజరాత్‌కు రూ.20 వేల కోట్ల కోచ్ ఫ్యాక్టరీ ఇచ్చి, తెలంగాణకు రూ.500 కోట్ల పరిశ్రమ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు బాజిరెడ్డి జగన్, దాసరి ఇందిర లక్ష్మీనర్సయ్య, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు చింత శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కృష్ణ, ఒడ్డెం నర్సయ్య పాల్గొన్నారు.



పోడు పట్టాలు అందజేస్తున్న ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

జంగిల్ ఇబ్బు హత్యకేసులో నిందితుడికి బెదిరింపులు

- ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు

ఖలీల్‌వాడి: నగరంలోని రౌడీషీటర్ ఇబ్రహీం ఛావూస్ అలియాస్ జంగిల్ ఇబ్బు హత్య కేసులో నిందితుడికి బెదిరింపులు రావడంతో సదరు నిందితుడు శనివారం ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. జనవరి 1న సారంగపూర్ శివారులో జంగిల్ ఇబ్బు, ఆరిఫ్ డాన్ మధ్య వివాదం చెలరేగింది. దీంతో ఇబ్బును ప్రత్యర్థులు 12 మంది కలిసి హత్య చేశారు. ఇందులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఆరిఫ్ డాన్‌ను జూన్1న ఎడపల్లి శివారులో ఇబ్బు అనుచరులు వాహనంతో ఢీకొని హత్య చేశారు. ఈ కేసులో ఉన్న పలువురిపై పోలీసులు కేసు నమోదు చేసి, జైలు పంపారు. తాజాగా ఇబ్బు హత్య కేసులో బెయిల్‌పై వచ్చిన మరో నిందితుడికి ఇబ్బు అనుచరులు వీడియో పంపి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిసింది. దీంతో నిందితుడు తన భార్యతో కలిసి ఇన్‌చార్జి పోలీస్‌కమిషనర్‌ను ఆశ్రయించారు. ఈ వీడియోలో హత్య కేసులో బెయిల్‌పై వచ్చామని ప్రతీకార చర్యలు తప్పవని వీడియోలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఫిట్స్‌తో బాలింత మృతి

నిజాంసాగర్: మండలంలోని బూర్గుల్ గ్రామానికి చెందిన తలారి మానస అనే బాలింతకు శనివారం రాత్రి పిట్స్ రావడంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆమె నెలన్నర కిందట పాపకు జన్మనిచ్చినట్లు పేర్కొన్నారు. మానసకు ఫిట్స్ రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

హెల్మెట్ ధరించాలి

తాడ్వాయి: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని ఎస్సై ఆంజనేయులు అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఏదైనా సహాయం కోసం 100 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

రోటరీ క్లబ్ కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం



కామారెడ్డి టౌన్: రోటరీ క్లబ్ ఆఫ్ కామారెడ్డి నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా పోలబోయిన సత్యం, కా ర్యదర్శిగా పి రాజనరసింహారెడ్డి, కోశాధికారిగా తోరణాల సుధాకర్, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు లక్ష్మీనర్సింలు, సుభాష్ చంద్, కాశీనా థం, ధనుంజయ, చంద్రశేఖర్, హరికిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.